క్లుప్తంగా

క్రీడా సామగ్రి అందజేత



పిడుగురాళ్ల: మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1998–99 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు క్రీడా సామగ్రిని బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లిఖార్జునరావు మాట్లాడుతూ... విద్యార్థులలో క్రీడలపై ఆసక్తి పెంపొందించడానికి ఇటువంటి చర్యలు దోహదపడతాయన్నారు. పూర్వ విద్యార్థులు బెల్లం కిషోర్, మునగా వెంకట్, యారం మల్లిఖార్జున్‌రెడ్డి, దేసినేని వెంకట్, మంగయ్య, భరత్, జానీభాషా, పిచ్చయ్య, సాగర్, మురళి, శ్రీను, గోపాల్, నర్రా వెంకట్రావు, తాజుద్దీన్, నాసర్ వలి, శంకర్, బికారి సాహెబ్, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు 'ఆర్‌ఎస్‌ఎస్' సమావేశం

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో కొలువై ఉన్న చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక సమావేశం జరుగుతుందని బీజేపీ పల్నాడు జిల్లా కార్యదర్శి శెట్టి హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సమావేశం జరుగుతోందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా రాష్ట్ర స్థాయి ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొంటారని హనుమంతరావు పేర్కొన్నారు.

14న విద్యుత్ లోక్ అదాలత్

మాచర్ల: మాచర్ల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ లోక్ అదాలత్ ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు మాచర్ల విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.సింగయ్య శనివారం తెలిపారు. సమావేశానికి ఏపీ సీపీడీసీఎల్ విజయవాడ సీజీఆర్‌ఎఫ్ ఫార్మర్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్, చైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ హాజరవుతారన్నారు. మాచర్ల పట్టణంలోని చంద్రవంక బ్రిడ్జి పక్కన విద్యుత్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సదస్సు జరుగుతుందన్నారు. సదస్సులో ప్రజలు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు దత్తాత్రేయుని ప్రతిష్ట



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామ శివారు నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసి విశేషంగా భక్తుల పూజలందుకుంటున్న శ్రీ ధనమల్లయ్య స్వామి క్షేత్రంలో నూతనంగా ప్రతిష్టించనున్న శ్రీ దత్తాత్రేయ స్వామి, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గణపతి సచ్చిదానంద స్వామి, శ్రీ దత్త విజయానంద బాలస్వామి ఆశీస్సులతో యాగశాలలో 12 మంది వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నార

పేకాట స్థావరంపై దాడి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని గొట్టిపాడు గ్రామ పొలాల్లో రహస్యంగా పేకాట (కోత ముక్క) ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.అనిల్‌కుమార్, సిబ్బందితో కలిసి గొట్టిపాడు గ్రామ పొలాల్లో నిఘా పెట్టారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,840 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

యోగాతో జీవితం ఆనందమయం

నరసరావుపేట రూరల్: యోగా ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగా గురూజీ తెలిపారు. రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ ఉచిత యోగ శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర యోగ గురూజీ అనుగ్రహ భాషణం అందించారు. విద్యార్థి దశలోనే యోగా సాధన చేయడం ద్వారా ప్రతిభ కనబర్చడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. 28రోజులు పాటు యోగా తరగతులకు హాజరైన వారికి, శ్లోకాలు అప్పజెప్పిన వారికి ప్రతిభా పురస్కారాలను బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు గురూజీ అందజేశారు. ఎంఏఎం కళాశాలల చైర్మన్ ఎం.శేషగిరిరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ గుంటుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం, నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 189వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు.

సైన్యంలా కదిలి సత్తా చాటుదాం



కరాలపాడు గ్రామంలో కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పిడుగురాళ్లలో కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

పిడుగురాళ్ల రూరల్: పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడితే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసి పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్యవిద్య అందుకుండా చూస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింత సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి, నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అసమర్థ నాయకులు రాజ్యమేలుతున్నారన్నారు. ప్రజల సొమ్మును ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టే విధంగా చంద్రబాబు నిర్ణయాలు ఉన్నాయన్నారు... దీనిలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమనికి శ్రీకారం చుట్టామన్నారు... అనంతరం గ్రామంలో సంతాకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, మాజీ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మూడేల వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గురువారెడ్డి, గురజాల నియోజవర్గ యూత్ అధ్యక్షులు సాంబశివరావు, జిల్లా యూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా యూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ చల్లా రంగారెడ్డి, అబ్దుల్లా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని 4, 6 వార్డులలో మెడికల్ కళాశాల, వైద్యశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల కార్యక్రమాన్ని శనివారం పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి స్థానికులతో మెడికల్ కాలేజీ వలన, వైద్యశాల వలన ప్రజలకు కలిగే ఉపయోగాల గురించి నాయకులు వివరించారు. వాటి ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించిన అనంతరం తమ ప్రాంతంలోని పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కామేపల్లి వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరిగాయని, ఇప్పుడు వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు ముక్త కంఠంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికులు కోటి సంతకాల కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోటి సంతకాల ప్రారంభం రోజు నుంచే ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తుంది. పార్టీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కందులూరి శివయ్య, చింతల జానికిరామయ్య, ఇల్లూరి వెంకయ్య, శెట్టుపల్లి పూర్ణ, చిట్టిబోయిన నరసింహారావుయాదవ్, పుణ్యాల వీరారెడ్డి, కొక్కెర శ్రీను, సాగర్, కమాస్ కట్టల బాష, మందా వెంకటరామయ్య, పుణ్యాల చంద్రారెడ్డి, బోగిరెడ్డి అంకిరెడ్డి, దిలీఫ్, షరీఫ్, నాగరాజు, కత్తి సాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత వ్యక్తిత్వంతో ఉత్తమ జీవితం



విద్యార్థులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి శివకుమార్

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు, ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీ శరత్ చంద్ర అకడమిక్ హెడ్ శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విజయం సాధించటానికి ప్రాథమిక సూత్రాలు ఉపకరిస్తాయన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో ఉత్తమ జీవితాన్ని సాధించుకోవచ్చని విద్యార్థులకు ప్రేరణ దాయకంగా ఉపన్యాసం అందించారు. తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న ఎ.నరసింహారావు మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ప్రవేశించడానికి గల సన్నద్ధతను, విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. గురజాల మోడల్ జూనియర్‌కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకుడు డి.సాంబశివరావు డిగ్రీ విద్యతో ఉన్న అపార ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నయింభాను, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజయకుమార్, ఇంగ్లిష్ అధ్యాపకుడు డాక్టర్ ఎస్‌కే మహమ్మద్ బాష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీఓ మండల అధ్యక్షుడిగా 'వున్నం'

గురజాల: ఏపీ ఎన్‌జీఓ మండల అధ్యక్షుడిగా వున్నం హనుమంతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి జి.బ్రహ్మేశ్వరరావు తెలిపారు. గురజాల మండల ఎన్‌జీఓ ఎన్నికల్లో భాగంగా శనివారం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మొత్తం 11 పోస్టులకు గాను 11 నామినేషన్లు వచ్చినట్లు, వ్యతిరేకంగా నామినేషన్‌లు రాకపోవడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించామన్నారు. సెక్రటరీగా వేముల శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కందిమల్ల నాగరాజు, ఉపాధ్యక్షులుగా అల్లం శ్రీనివాసరావు, ఎస్.క్రిష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీగా స్వప్న, శ్రీనివాసరావు, పి.నరసింహారావు, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా రమాదేవి భాయి, కోశాధికారిగా అంకమ్మరావులు ఏకగ్రీవమైనట్లు అధికారి తెలిపారు. ఈ ఎన్నికలకు ముఖ్యఅతిథిగా మార్లపాటి రామకృష్ణ, రామయ్య, పట్టాభిలు పాల్గొన్నారు.

దావుపల్లి తండాలో మెడికల్ క్యాంపు



తండాలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రవికుమార్

వెల్దుర్తి: ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా శనివారం డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ నల్లమల అడవిలో మారుమూల ప్రాంతంలోని దావుపల్లి తండాలో మెడికల్ క్యాంపు నిర్వహించటం జరిగిందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగుకాల్వలలోని మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వారానికొకసారి డ్రై డే ను పాటించాలన్నారు. దోమతెరలు వాడటం వలన రోగాలబారిన పడకుండా తప్పించుకోవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హెల్త్ సిబ్బంది తండాలలో వారానికొకసారి క్యాంపు నిర్వహించి వారికి కావాల్సిన మందులను పంపిణీ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డీఎంఓ కె.రవీంద్ర రత్నాకర్, పిహెచ్‌సీ డాక్టర్ దాక్షాయణి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న గీతిక సీబీఎస్‌ఈ స్కూల్ చైర్మన్ బాలగంగాధర్‌రెడ్డి

పిడుగురాళ్ల: తిరుపతి జిల్లా చంద్రగిరిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పిట్టు క్రీడలకు మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉన్న గీతిక సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి బాలగంగధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్ 8,9 తేదీలలో నిర్వహించిన జిల్లాస్థాయి పిట్టు పోటీలలో తమ పాఠశాలకు చెందిన జినీఫ్, తేజశ్వన్, గోపిచరణ్‌లు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. వైస్ చైర్మన్ తాళ్లపల్లి పద్మ శ్రీ, డైరెక్టర్ తాళ్లపల్లి వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ముంద్రా అజయ్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

విద్యార్థులకు అభినందనలు



కారెంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గురజాల డివిజన్‌స్థాయి పోటీలకు కారెంపూడి సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూలు నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బి.నోమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పాఠశాలలో శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీలు నేనావత్ శివకృష్ణ నాయక్, నందిని ఎంపికై న విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, కరస్పాండెంటు మర్రి అనిల్ కుమార్‌లు అభినందించారు.

అన్నదానం

కారెంపూడి: కారెంపూడి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చింతపల్లి గ్రామానికి చెందిన డి సుభాని, వినుకొండకు చెందిన యక్కల భాను ప్రకాష్ కుటుంబాలు 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు భవిరిశెట్టి రామారావు తదితర ఆర్యవైశ్య సంఘ పెద్దలు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి

నరసరావుపేట టౌన్: బాకీ డబ్బులు అడిగినందుకు దాడి చేశారనే బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ శనివారం తెలిపారు. మేడికొండూరు మండలం డోపర్తి గ్రామానికి చెందిన నాగండ్ల ఝాన్సీ నరసరావుపేట కంభంపాలెంలో నివాసం ఉంటున్న తన అక్క కుమారుడు కొండెపోగు దినేష్ కుమార్‌కు రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వకపోవటంతో అడిగేందుకు శుక్రవారం అతని ఇంటి వద్దకు వెళ్లింది. బాకీ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆమెపై దినేష్‌కుమార్, అతని అన్న నరేష్ ఇద్దరు అసభ్యకరంగా దూషించి దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాణసంచా తయారీ దుకాణంపై కేసు

చిలకలూరిపేటటౌన్: దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న ఒక దుకాణంపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీపావళి మందుల తయారీకి వివిధ శాఖల నుంచి పూర్తిస్థాయి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా అలాంటి నిబంధనలను పాటించకుండా స్థానికంగా తయారు చేస్తుండడాన్ని పోలీసులు తమ తనిఖీల్లో గుర్తించి, సదరు దుకాణంపై కేసు పోలీసులు నమోదు చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



క్రోసూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ తులసి, సిబ్బంది

క్రోసూరు: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. స్థానిక నాలుగురోడ్లసెంటర్‌లో స్థానికులతో కలిసి శనివారం కేర్ యాక్టివిటీలో భాగంగా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నాటుసారా, డ్రగ్స్, గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ టి.తులసి మాట్లాడుతూ సమాజంలో నాటుసారాయి, డ్రగ్స్, గంజాయి అలవాట్లు చెదపురుగులాంటివని అన్నారు. వీటి బారిన పడినవారి కుటుంబాలు అధోగతి పాలవుతాయన్నారు. ప్రజలు, యువత, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వీటిని వినియోగిస్తున్నట్లు తెలిసినా, ఎక్కడైనా విక్రయిస్తున్నారని తెలిసినా ఎక్సైజ్‌శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. నాటుసారా, డ్రగ్స్, గంజాయితో పట్టుబడితే కఠిన శిక్షలుంటాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్. సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

వినుకొండ: స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయించరాదని, ఎవరైనా అలా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బ్లాక్ బర్లీ టుబాకో సాగు చేయకూడదన్నారు. మొక్కజొన్న విత్తన పథకం కింద సాగు చేసే రైతులు సంబంధిత కంపెనీ నుంచి బాండ్ తీసుకున్న తరువాత మాత్రమే మొక్కజొన్న పంట సాగు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ డీలర్లు ఎరువులు డీబీటీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. యూరియా అవసరం మేరకే కొనుగోలు చేయాలన్నారు. ఏడీఏ రవికుమార్, ఏఓలు జి.వరలక్ష్మి, అంకారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



లింగారావుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారులు

నాదెండ్ల: ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావసతులను బాలికలు అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదివి ఎదగాలని జన విజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షుడు ధూళిపాళ్ళ వెంకటరావు చెప్పారు. పోతవరంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జన విజ్ఞాన వేదిక, జ్ఞానేశ్వరి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికల అభివృద్ధికి అనేక చట్టాలున్నాయని, ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. జేవీవీ ప్రచురించిన ఎదిగే ఆడపిల్లలు ఏం తెలుసుకోవాలి అనే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ నెల 18న నిర్వహించే స్కూలుస్థాయి చెకుముకి సంబరాలకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, దార్ల బుచ్చిబాబు, చుక్కా విన్సెంట్‌పాల్, గార్స్ ప్రధానకార్యదర్శి బుల్లిబాబు, సతీష్, పాఠశాల ప్రత్యేకాధికారి అష్రిఫున్ పాల్గొన్నారు.

లింగారావుపాలెంలో..

యడ్లపాడు: విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని, బాలికలను చక్కగా చదివించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు పున్నమ్మ, అనురాధ చెప్పారు. లింగారావుపాలెం గ్రామంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం శనివారం నిర్వహించారు. చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు ఆడబిడ్డలను చదివించాలని, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచాలన్నారు. బాల్యవివాహాలతో అనర్థాలు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మద్యపానం దుష్ఫలితాలపై అవగాహన



అన్నవరంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామంలో ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో మద్యపానం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం, గంజాయి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యపానం వల్ల కలిగే దుష్ఫలితాలపై గ్రామస్తుల్లో అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్సైజ్ సంబంధిత నేరాలపై సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం రొంపిచర్లలోని నీలకంఠేశ్వర వైన్స్, వి.రెడ్డిపాలెంలోని తిరుమల వైన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో నాదెండ్ల విద్యార్థుల ప్రతిభ



నాదెండ్ల: యోగాలో నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే డివిజన్‌స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాదెండ్ల జిల్లాపరిషత్ విద్యార్థులు అండర్–14 విభాగంలో సాత్విక్, కార్తీక్, అనూష, అండర్–17లో మహేశ్వరి, వెంకటసాయి ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో వీరు జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు హాజరుకానున్నారు. పీడీ హనిమిరెడ్డి, పీఈటీ అమీర్‌హుస్సేన్, హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ప్రతిష్టా మహోత్సవం



ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన హోమం



ప్రతిష్టించిన వినాయక విగ్రహం

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన హరిహర క్షేత్ర మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షా విధానంగా ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించారు. హరిహర క్షేత్ర మందిరంలో వినాయక, వేంకటేశ్వర, పరమేశ్వర, నందీశ్వర, గరుత్మంత విగ్రహాలను ప్రతిష్టించారు. వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతిష్ట సందర్భంగా చుట్టపక్కాలు, బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

మాలధారులకు అన్నదానం



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో నిర్మిస్తున్న విఘ్నేశ్వర దత్తాత్రేయ సమేత షిర్డీ సాయిబాబా దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన దక్షిణామూర్తి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యాన అయ్యప్పలకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అయ్యప్పలు, దేవాలయ చారిటబుల్ ట్రస్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.